క్లుప్తంగా

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం



గుడివాడరూరల్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా ముందస్తుగానే అన్ని చర్యలు చేపడతామని గుడివాడ టూటౌన్ సీఐ ఎంఎస్ దుర్గారావు అన్నారు. పట్టణంలోని మందపాడు, పెద ఏరుకపాడు ప్రాంతాల్లో ఎన్నికల సిబ్బంది ఆధ్వర్యంలో ఈవీఎంలపై ప్రజలకు నిర్వహించిన అవగాహన సదస్సులో సీఐ గురువారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఈవీఎంల పనితీరు, ఓటు హక్కు వినియోగించే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో వీఎల్‌వోలు కూడా ఈవీఎంలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది, పోలీస్ సిబ్బంది, ఆయా ప్రాంతాల్లోని ప్రజలు పాల్గొన్నారు.

చిన్నారికి ఎమ్మెల్యే జోలాలి



గుడివాడ టౌన్: తన రాజకీయ ప్రత్యర్థులకు కంటిమీద కునుకు లేకుండా చేసే గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) చిన్నారులను లాలించి నిద్ర పుచ్చడంలో కూడా తన ప్రత్యేకతను ప్రదర్శించారు. కృష్ణా జిల్లా గుడివాడలోని ఆయన నివాసానికి గురువారం స్థానికులు కొందరు తమ సమస్యను చెప్పుకునేందుకు వచ్చారు. వారితో తీసుకొచ్చిన ఓ చిన్నారి ఏడ్పు మొదలు పెట్టింది. వెంటనే ఎమ్మెల్యే ఆ చిన్నారిని తీసుకుని భుజంపై వేసుకుని జో కొట్టడం ప్రారంభించారు. కొద్దినిమిషాల్లోనే ఏడ్పు ఆపి చిన్నారి నిద్రలోకి జారుకోవడం.. ఆ చిన్నారి తల్లిదండ్రులను సైతం ఆశ్చర్యచకితులను చేసింది. అనంతరం నాని వారి సమస్యను తెలుసుని సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కరించవలసిందిగా సూచించారు.

ఉత్తమ ఏఎన్ఎం అనురాధ లక్ష్మికి సన్మానం



కైకలూరు: జిల్లాలో ఉత్తమ ఏఎన్ఎంగా గణతంత్ర దినోత్సవం రోజున అవార్డు పొందిన బోనం అనురాధ లక్ష్మిని శృంగవరప్పాడు సచివాలయంలో సిబ్బంది, గ్రామ పెద్దలు గురువారం సన్మానించారు. ఏఎన్ఎం లక్ష్మి మాట్లాడుతూ ఉత్తమ అవార్డుతో మరింత బాధ్యతగా సేవలు అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో శృంగవరప్పాడు, గుమ్మళ్లపాడు సర్పంచులు ఘంటసాల భాగ్యలక్ష్మి, కొయ్య గంగయ్య, ఎంపీటీసీ ఘంటసాల నాగమణి, ఉప సర్పంచులు ఊడుమూడి సత్యవతి, సైదు నాగరాజు, గుమ్మళ్లపాడు మాజీ సర్పంచ్ సైదు వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పొద్దుపొడవక ముందే చేతిలో పింఛన్



గుడివాడ టౌన్: ఫిబ్రవరి నెలకు సంబంధించిన అవ్వాతాతల పింఛన్ పంపిణీ గురువారం పొద్దుపొడవకముందే ప్రారంభమైంది. గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లు నగదును లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి చేతిల్లో నగదు పెట్టారు. దీంతో వృద్ధులు హర్షం వ్యక్తం చేశారు. గుడివాడ పట్టణంలో మొత్తం 11,126 మంది లబ్ధిదారులు ఉండగా ఒక్క రోజులోనే 8,900 మందికి పైబడి పెన్షన్ పంపిణీ చేశారు.

కొండలమ్మను దర్శించుకున్న బ్రహ్మానంద సరస్వతి

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ వారిని ఇచ్ఛాపురం నైమి శరణ్య పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి గురువారం దర్శించుకున్నారు. ఆయనతో శ్రీదేవీ మహత్యం ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన్ను ఆలయ చైర్మన్ శేషం గోపి, ఈఓ సురేష్ ఆలయ మర్యాదలతో సన్మానించి అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. తొలుత ఆయన పేరిట అమ్మవారికి వేద పండితులు ప్రత్యేక పూజలను చేశారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు ఘంటసాల పాటల కచేరి

గుడివాడ టౌన్: స్థానిక కన్యకా పరమేశ్వరి దేవస్థాన ప్రాంగణంలో శనివారం సాయంత్రం 6 గంటలకు ఘంటసాల భక్తిగీతాల కచేరి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు భీమవరానికి చెందిన చిప్పాడ నాగేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఘంటసాల అభిమానులు, సంగీత ప్రియులుపెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఏలూరు 'సిద్ధం'.. విజయవంతం చేద్దాం

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పిలుపు

పామర్రు: వైఎస్సార్ సీపీ ఎన్నికల శంఖారావం బహిరంగ సభ 'సిద్ధం'లో నియోజకవర్గంలోని నాయకులు కార్యకర్తలు అభిమానులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఐదు మండలాల నాయకులతో బహిరంగ సభ విజయవంతంపై అవగాహన సన్నద్ధ సభను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పామర్రు నియోజకవర్గం నుంచి వేలాదిగా పార్టీ కేడర్ సభకు హాజరు కావాలన్నారు. ఏలూరు నగర సమీపంలోని దెందులూరులో జాతీయ రహదారి వద్ద 110 ఎకరాల స్థలంలో సభా వేదిక ఏర్పాటు చేశారన్నారు. పదుల సంఖ్యలో గ్యాలరీలను ఏర్పాటు చేశారని అన్నారు. ఈ నెల 3వ తేదీన జరిగే సభ కార్యక్రమానికి ఆరోజు ఉదయం పార్టీ కార్యాలయం నుంచి బయలు దేరాలని అన్నారు.



పామర్రులో పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్రంలోని ప్రతి పేద వాడు సంపన్నులు కావాలన్నదే ప్రభుత్వం సంకల్పం అన్నారు. అందుకే నవరత్న పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చుతోందని చెప్పారు. కుల, మత, ప్రాంత పార్టీ అని విభేదాలు లేకుండా అర్హత ఒక్కటే ప్రామాణికంగా తీసుకుని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

రోడ్ల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే డీఎన్నార్

కలిదిండి: ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పిస్తూనే సంక్షేమ పథకాలను అమలు చేయడంలో సీఎం జగన్ నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. గురువారం వెంకటాపురం, గోపాలపురం గ్రామాల్లో సీసీ రోడ్లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వెంకటాపురంలో రూ.13.74 లక్షలు, గోపాలపురంలో రూ.8.50 లక్షల నిధులతో సీసీ రోడ్లను నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, వైస్ ఎంపీపీ కట్టా నాగలక్ష్మి, పార్టీ మండలాధ్యక్షుడు తిరుమాని రమేష్, గోపాలపురం సర్పంచ్ అనపర్తి వర్డీకాసులు, ఉప సర్పంచ్ వాకాని నాగరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు అంకెం నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి పెద్ద పీట..

కైకలూరు: గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. కై కలూరు పంచాయతీ పరిధిలో సంత మార్కెట్ నుంచి శ్యామలాంబ ఆలయం వరకు రూ.30 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక హ్యామయున్ సయ్యద్ వీధిలో రూ.12.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ఎంపీటీసీ మంగినేని రామకృష్ణ, మండల సర్పంచుల సంఘ అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, రాష్ట్ర, జిల్లా ముస్లిం మైనార్టీ నాయకులు హమీద్, షేక్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.



కైకలూరులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

పలువురు మండలాధికారుల బాధ్యతల స్వీకారం



తోట్లవల్లూరు ఎంపీడీఓ సత్యనారాయణ

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు ఎంపీడీఓగా ఐ. సత్యనారాయణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గుంటూరు జిల్లా కొల్లూరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన తుంగల స్వర్ణలత ఏలూరు జిల్లా భీమడోలుకు బదిలీపై వెళ్లారు. ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణకు ఈఓపీఆర్‌డీ సూరపనేని రత్న, ఎంఈఓ(2) సురేష్, కార్యాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

మొవ్వ ఎంపీడీవోగా చంద్రశేఖరరావు..



మొవ్వ ఎంపీడీవో చంద్రశేఖర్

మొవ్వ: మొవ్వ ఎంపీడీవోగా సి. చంద్రశేఖరరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా భట్టిప్రోలు మండలం నుంచి ఎన్నికల బదిలీల్లో భాగంగా మొవ్వ మండలానికి విచ్చేశారు. ఇప్పటి వరకు మొవ్వ ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వర్తించిన జి. సుధాప్రవీణ్ పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీపై వెళ్లారు. కొత్త తహసీల్దార్‌కు ఈవోపీఆర్‌డీ వీర్ల సీతారామరాజు, పీఆర్ ఏఈ బి. రామారావు, జూనియర్ అసిస్టెంట్ సీహెచ్ రామ్మూర్తి, సిబ్బంది స్వాగతం పలికారు.

ముదినేపల్లి ఎంపీడీవోగా గంగాధర్



ఎంపీపీ రామిశెట్టికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ముదినేపల్లి ఎంపీడీవో గంగాధర్

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి ఎంపీడీవోగా ఎస్ఎం గంగాధరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సాధారణ బదిలీల్లో భాగంగా గంగాధరరావు పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం నుంచి ఆయన ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో పి.మల్లీశ్వరిని పల్నాడు జిల్లాకు బదిలీ అయ్యారు. నూతన ఎంపీడీవో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఏవో రమణబాబు, ఈవోపీఆర్డీ డి.లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పామర్రులో తహసీల్దార్‌కు వీడ్కోలు..

పామర్రు: పామర్రు తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న వీవీ భరత్‌రెడ్డి తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు తహసీల్దార్‌ను గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఉత్తమమైన సేవలు చేసిన వారు ప్రజలలో ఎల్లప్పుడూ గుర్తుండిపోతారని అటువంటి వారిలో తహసీల్దార్ ఒకరని అన్నారు. పామర్రు వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, విజయవాడ కృష్ణామిల్క్ యూనియన్ జిల్లా ట్రస్టు బోర్డు జిల్లా సభ్యులు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, మండల ఆర్బీకే చైర్మన్ ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పామర్రు తహసీల్దార్ భరత్‌రెడ్డిని సన్మానిస్తున్న పార్టీ నాయకులు

మండవల్లి ఎంపీడీవోగా బేబీ శ్రీలక్ష్మి



మండవల్లి ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి

మండవల్లి: మండవల్లి ఎంపీడీవోగా ఆర్. బేబీ శ్రీలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలోని కొయ్యలగూడెం నుంచి బదిలీపై ఆమె ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఈఓపీఆర్డీ ఎ.ఆనందబాబు విధులు నిర్వర్తించారు.

బదిలీపై వెళ్లిన తహసీల్దార్‌కు సన్మానం



పెదపారుపూడి తహసీల్దార్ నాగభూషణంను సన్మానిస్తున్న వీఆర్వోలు

పెదపారుపూడి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌గా పని చేస్తున్న వి. నాగభూషణం బదిలీపై రాజమండ్రి వెళ్లటంతో గురువారం వీఆర్వోలు, కార్యాలయం సిబ్బంది వీడ్కోలు సమావేశం నిర్వహించారు. వీఆర్వోలు, వీఆర్ఏలు తహసీల్దార్‌ను శాలువాలతో సన్మాంచి కేక్ కటింగ్ చేశారు. కార్యక్రమంలో కార్యాలయ సుపరింటెండెంట్ వాణి, వీఆర్వోలు చాట్ల అజయ్‌కుమార్, భగవంతరావు, ప్రసాద్, ఆనందరావు, దానియేలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

శరవేగంగా రోడ్ల నిర్మాణాలు

గుడ్లవల్లేరు: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) కృషితో గుడివాడ నియోజకవర్గంలో గుడ్లవల్లేరు, గుడివాడ రూరల్ మండలాల్లో రూ.4కోట్ల ప్రభుత్వ నిధులతో శరవేగంగా మూడు రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా కూచికాయలపూడి - అంగలూరు చెరువు వరకూ 4.4కిలోమీటర్ల వరకూ రోడ్డు నిర్మాణ పనులను నిర్మిస్తున్నామని ఆర్అండ్‌బీ ఏఈ శ్రీనివాసరావు గురువారం తెలిపారు.

రోప్ స్కిప్పింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



పామర్రు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోప్ స్కిప్పింగ్ పోటీలలో ఆసీస్సీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని ప్రిన్సిపల్ సిస్టర్ వలసా సబాస్టియన్ తెలిపారు.గురువారం విజేతలైన విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జనవరి 28, 29, 39 తేదీలలో భీమవరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్‌లో వివిధ విభాగాల్లో తమ విద్యార్థులు జి. మహిత, జి. ఆదర్శ బహుమతులు సాధించారన్నారు. వీరికి శిక్షణ ఇచ్చిన మట్టా గ్లాడిసన్, శ్రీనివాస్‌లను అభినందించారు.

నేడు గ్రూప్-2 అభ్యర్థులకు శిక్షణ

గుడివాడ టౌన్: యూటీఎఫ్ ఆధ్వర్యంలో గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ గుడివాడ ప్రాంతీయ కార్యాలయ ఇన్‌చార్జ్ నీలం ప్రభాకరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక గౌరీశంకరపురంలోని విద్యావికాస్ పాఠశాల ఎదురుగా గల అంబేడ్కర్ భవన్‌లో సాయంత్రం 5 గంటల నుంచి ఈ శిక్షణ తరగుతులు నిర్వహిస్తామన్నారు. శిక్షణకు హాజరైన వారికి 228 పేజీల మెటీరియల్ ఉచితంగా అందజేస్తామన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

పమిడిముక్కల: సీఐ కిశోర్‌బాబు ఆధ్వర్యంలో గురువారం ఎక్సైజ్, పోలీస్ సిబ్బంది కలిసి అక్రమ మద్యం విక్రయిస్తున్న వారిపై దాడులు చేశారు. పైడికొండల పాలెంలో వనాబత్తిన వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొన్నారు. మండలంలో అక్రమ మద్యం విక్రయించినా, పేకాట, కోడిపందేలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకొంటామని సీఐ హెచ్చరించారు.

విశ్వ బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి

కైకలూరు: విశ్వ బ్రాహ్మణులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల అమలుతో పాటు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ చెప్పారు. స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం వద్ద కైకలూరు నియోజకవర్గ విశ్వ బ్రాహ్మణ సంఘ 27వ వార్షికోత్సవం గురువారం జరిగింది. ముఖ్య అతిథులు విశ్వ బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన సిద్ధాంతులు, ఆర్ఎంపీ డాక్టర్లను సన్మానించారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలాలను మంజూరు చేశామన్నారు. ముఖ్యఅతిథులను సంఘ సభ్యులు సత్కరించారు. కై కలూరు సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, నియోజకవర్గ విశ్వ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు తుపాకుల సోమాచారి, గుడివాడ విశ్వ బ్రాహ్మణ సంఘ నాయకులు గానుగుల రాజా, కంచుమోజు దుర్గాచారి, మొగల్తూరు విశ్వ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు చింతోజు పాండురంగారావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, సర్పంచ్‌లను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

సీఎం జగన్‌ను ఆశీర్వదించాలి

మండవల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ప్రజలందరూ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ కోరారు. మండలంలోని పులపర్రులో గురువారం జరిగిన ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము), ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, ముంగర మల్లికార్జునరావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి కబడ్డీ జట్లు

పమిడిముక్కల: ఆడుదాం.. ఆంధ్రా జిల్లా స్థాయి మహిళల, పురుషుల కబడ్డీ పోటీలు గన్నవరం బాలుర హైస్కూల్‌లో బుధవారం రాత్రి జరిగాయి. ఈ పోటీల్లో మహిళల విభాగంలో పమిడిముక్కల జట్టు ప్రథమ స్థానాన్ని, పురుషుల విభాగంలో పమిడిముక్కల జట్టు తృతీయ స్థానం సాధించింది. క్రీడాకారులను, వారికి శిక్షణ ఇచ్చిన పీడీలు బాలస్వామి, రవీంద్రబాబు, నారాయణ, జవహర్‌బాబులను ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు కాసాని వేద సుప్రజ, మండల పార్టీ అధ్యక్షుడు యలమంచిలి గణేష్ అభినందించారు.



కబడ్డీ మహిళల విభాగంలో విజేత పమిడిముక్కల జట్టు

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు వడ్లమన్నాడు జట్టు

గుడ్లవల్లేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా'లో విశాఖపట్నంలో తలపడనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు వడ్లమన్నాడు క్రీడాకారుల జట్టు ఎంపికైంది. ఈ విషయాన్ని గురువారం ఎంపీడీఓ డి.శ్రీనివాస్ విలేకరులకు తెలిపారు. గన్నవరంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో వడ్లమన్నాడు జట్టు ప్రథమ స్థానం పొందినట్లు ఆయన చెప్పారు. విజేతలను ఆ గ్రామ సర్పంచి కటికల జ్యోతిలత, వ్యవసాయ సలహా కమిటీ జిల్లా డైరెక్టర్ పెన్నేరు ప్రభాకరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు శేషం గోపి, ఎంపీటీసీ మండా దిలీప్‌కుమార్ అభినందించారు.



రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన వడ్లమన్నాడు పురుషుల జట్టు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

మండవల్లి: సామాన్య ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. పీఎం జీవన జ్యోతి బీమా యోజన పథకం కింద 7 కుటుంబాలకు రూ.14 లక్షల బీమా చెక్కులను మండవల్లిలోని బ్యాంక్ వద్ద గురువారం అందజేశారు. అయ్యవారిరుద్రవరానికి చెందిన కుంచే లక్ష్మి, కుంచే నాగరాజు, చింతపాడుకు చెందిన జీవీ నాగబాబు, గన్నవరానికి చెందిన కె.రమాదేవి, పెరికెగూడెంకు చెందిన వి.నాగమణి, మరో రెండు కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.2 లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం

పామర్రు: స్థానిక టీఎస్ఆర్ అండ్ ఐఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ కేఆర్‌జీ శేషుకుమార్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. శ్రీనివాస్, అధ్యపకులు గురువారం సత్కరించారు. జనవరి 26వ తేదీన జరిగిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అధ్యాపకుడిగా శేషుకుమార్ అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించిన ఆయనను సత్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 25 ఏళ్లుగా ప్రభుత్వ ఉద్యోగిగా, ప్రభుత్వ అధ్యాపకుల సంఘ జీసీజీటీఏ ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా, శ్రీశ్రీ కళా వేదిక వంటి సాహిత్య కళా సంస్థల ద్వారా అనేక సేవలందిస్తున్న శేషుకుమార్ తమ కళాశాల అధ్యాపకుడు కావడం గర్వ కారణమన్నారు.



తెలుగు అధ్యాపకుడు శేషుకుమార్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు

పేదల సొంతింటి కలను నెరవేర్చిన సీఎం జగన్



తక్కెళ్లపాడులో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కలను నెరవేర్చారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడులో ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ గ్రామాల్లో సుస్థిరమైన అభివృద్ధి సీఎం జగన్‌కే సాధ్యమన్నారు. ఈ సందర్భంగా 131 మందికి పట్టాలు పంపిణీ చేశారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము), ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు

మొవ్వ: మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 11 నుంచి 21వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ కేవీఎస్‌వీ ప్రసాద శాస్త్రి తెలిపారు. 78 మంది ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు హాజరవుతారని చెప్పారు. అలాగే ఈ నెల 5వ తేదీ నుంచి 16 రోజులపాటు వృత్తి విద్యా విభాగం మొదటి, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షల్లో తమ కళాశాల నుంచి 112 మంది విద్యార్థులు పాల్గొంటారని వివరించారు.

వైఎస్సార్ బీమా అందజేత

పమిడిముక్కల: మంటాడ రెడ్డిపాలెంకు చెందిన కాగితాల సూరిరెడ్డి(44) ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. మృతునికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. వైఎస్సార్ బీమా పథకం కింద మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందజేశారు. బీమా సాయం మొత్తం లక్ష రూపాయలు మంజూరైందని, మిగిలిన రూ.90 వేలు వారి ఖాతాలో జమచేస్తారని ఎంపీటీసీ మేరుగ లక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, పార్టీ నాయకులు కోడెబోయిన కోటేశ్వరరావు, ధూళిపూడి వీరకోటేశ్వరరావు, సతీష్, కాగితాల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఆర్పీ

ముదినేపల్లి రూరల్: ప్రకృతి వ్యవసాయంపై మండలంలోని బొమ్మినంపాడులో రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ సదస్సులో రబీలో సాగు చేసిన మినప పైరు పెరుగుదలకు సంబంధించి పలు అంశాలను వివరించారు. దీనిని ఏవిధంగా ఉపయోగించాలో ప్రయోగాత్మకంగా రైతులకు తెలిపారు. సదస్సులో సీఆర్పీలు అనూష, సుధాకర్ పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం స్వర్ణకుమారి

కలిదిండి: కేంద్ర ప్రభుత్వం అందించే ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు కలిదిండి ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం బి.స్వర్ణకుమారి గురువారం తెలిపారు. 8వ తరగతికి చెందిన జాజుల స్వరూప, కలాపాల నిహారిక, కలంకూరి అనిల్ కుమార్ ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ప్రతిభ చాటి అర్హత సాధించారన్నారు. వీరికి 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏడాదికి రూ.12 వేలు చొప్పున స్కాలర్‌షిప్ వస్తుందని తెలిపారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ హుర్మతున్నీసా, ఉపాధ్యక్షురాలు సుబ్బలక్ష్మి, పాఠశాల సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులకు జీతాలు చెల్లింపు

గుడివాడ టౌన్: మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికుల సమ్మె కాలంలో చెల్లించాల్సిన జీతాన్ని గురువారం అందించారు. సమ్మె కాలపు జీతాన్ని చెల్లించేందుకు సంబంధిత కాంట్రాక్టర్ నిరాకరించడంతో సమస్యను కాంట్రాక్ట్ కార్మికులు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన శశిభూషణ్ డిసెంబర్ 26 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 13 రోజులు సమ్మె చేసిన కార్మికుల జీతాలను వెంటనే చెల్లించాలని కాంట్రాక్టర్ కు సూచించారు. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ ఉదయం 8 గంటలకే కార్మికుల ఖాతాలో సొమ్ము జమచేయడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ అనుబంధ సంస్థ మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు అద్దేపల్లి పురుషోత్తం కార్మిక నాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము దేవదాయ ధర్మదాయ శాఖ

శ్రీ అలివేలుమంగా పద్మావతి సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం,

మంటాడ గ్రామం, పమిడిముక్కల మండలం, కృష్ణాజిల్లా.

సీల్డ్-టెండర్-కమ్-బహిరంగ వేలం ప్రకటన

కృష్ణాజిల్లా, పమిడిముక్కల మండలం, మంటాడ గ్రామంలో వేంచేసియున్న శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానమునకు చెందిన ఐటమ్‌లకు ఈ క్రింది తెలిపిన వివరముల నిమిత్తం సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్‌దారు తప్పనిసరిగా ఆధార్‌కార్డ్, టిన్ నెంబర్, పాన్ నెంబరు మరియు వస్తుసేవల పన్ను ఖాతా నెంబరు కలిగిన వారు కార్డు నకళ్ళను దేవస్థానము కార్యాలయము నందు సమర్పించి ఈ క్రింది తెలిపిన టెండర్ ధరావతులను డి.డి. రూపములో చెల్లించి మరియు టెండర్ షెడ్యూల్ కొరకు రూ. 500/-లు నగదు చెల్లించి షెడ్యూల్ పొందవలయును.

వ.నెం.	ఐటమ్ వివరములు	ధరావతు సొమ్ము రూ.	కాలపరిమితి
1.	శ్రీ స్వామివారి దేవస్థానములో కళ్యాణమండపం మరియు అన్నదాన మండపములలో శుభకార్యముల సందర్భంగా షామియానా వంటసామాగ్రి సరఫరా చేయు లైసెన్స్ హక్కునకు	రూ. 25,000/-	ది. 01-04-2024 నుండి ది. 31-03-2026 వరకు
2.	శ్రీ స్వామివారి దేవస్థానములో కళ్యాణమండపం మరియు అన్నదాన మండపములలో, దేవాలయ ఆవరణలో శుభకార్యముల సందర్భంగా లైటింగ్ డెకరేషన్ చేయు లైసెన్స్ హక్కునకు	రూ. 25,000/-	ది. 01-04-2024 నుండి ది. 31-03-2026 వరకు
3.	శ్రీ స్వామివారి దేవస్థానము యొక్క షాప్ నెం. 2 (12.6/8) కొలతలు గల షాపు అద్దె హక్కునకు	రూ. 30,000/-	స్వాధీనపరచిన తేదీ నుండి 3 సం॥ల కాలపరిమితి
4.	పాత ఇనుప సామాన్లు, ఖాళీ నూనె డబ్బాలు	రూ. 5000/-	

1) శ్రీయుత కమీషనర్, దేవదాయ, ధర్మదాయ శాఖ, ఆంధ్రప్రదేశ్, గొల్లపూడి వారి ఆదేశములు సర్క్యులర్ ఐస్. ఆర్.సి. నెం. టిపి. 2019/25026/1 తేది. 2019-05-25 షరతుల ప్రకారం టెండర్లను వేయవలెను. 2) దేవదాయ ధర్మదాయ శాఖ హిందూ మత సంస్థ అయినందున హిందువులు మాత్రమే పాటలో పాల్గొనుటకు అర్హులు మరియు దేవాలయమునకు ఏవిధమైన బకాయిలు వున్న వారు గానీ, కోర్ట్ వ్యాజ్యములు ఉన్నవారుగానీ ఈ టెండరు దాఖలు చేయుటకు / బహిరంగ వేలములో పాల్గొనుటకు అనర్హులు.

టెండరు షెడ్యూల్ ఇచ్చు తేది : 05-02-2024 ఉ॥ 10-00 లనుండి, పూర్తిచేసిన టెండర్ షెడ్యూల్ స్వీకరించు తేది : 08-02-2024 సాయంత్రం 5-00 గం॥ల వరకు, టెండర్ తెరచు తేదీ : ది. 09-02-2024 ఉ॥ 11-00 గం॥లకు

ఇతర వివరములకు దేవస్థానం కార్యాలయము పనివేళలలో తెలుసుకొనగలరు. ఫోన్ : 97013 35070

వ్యవస్థాపక ధర్మకర్త & చైర్మన్ ధర్మకర్తల మండలి కార్యనిర్వహణాధికారి

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

గుడివాడ డివిజన్

99516 02865 (గుడివాడ)

99516 02985 (కైకలూరు)

90105 77706 (పామర్రు)

Office mail : sakshiads@gmail.com